

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్‌గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand@hotmail.com**

## ఫణియమ్మ

**భాష:** కన్నడ, **సంగీతం** -బి.వి.కారంత్, **స్క్రీన్ ప్లే, దర్శకత్వం** - ప్రేమాకారంత్;

**నటీనటులు** - ఎల్.వి.శారదారావి, బేబి ప్రతిమ, ప్రతాభా కాసరవెల్లి

**విడుదల:** 1983




**పుట్టుకతోనే ఎవరూ ఆడవాళ్ళు కారు.** ఆ తర్వాతే ఆడవాళ్ళుగా రూపొందుతారు - కాదు ఈ సమాజమే వాళ్ళని ‘ఆడవాళ్ళు‘గా తయారుచేస్తుంది. ఎప్పుడైతే ఉత్పత్తి సంబంధాల నుండి స్త్రీ పరాయీకరింపబడి కేవలం పునరుత్పత్తి సంబంధాలకు పరిమితం చేయబడిందో అక్కడి నుంచే స్త్రీ పరాధీనత క్రమంగా పెరుగుతూ వచ్చింది. అదే క్రమంలో పితృస్వామ్యం బహుముఖంగా విస్తరింపబడుతూ పురుషాధిక్యత బలం హెచ్చుతూ వచ్చింది. ఆ పితృస్వామ్యానికి భావజాలపరంగానూ, నిర్మాణరీత్యానూ శక్తినిచ్చే కృషి మత, రాజకీయ వ్యవస్థలు అవిరళం కృషి సల్పుతూ వచ్చాయి. పితృస్వామ్య భావజాలం ఫలితంగా మన వ్యవస్థలో 19వ శతాబ్ధంలో బాలవితంతువులు ఏర్పడ్డారు. బాల్యవివాహాలు చేయడం భర్తలు మరణిస్తే ఆ బాలికల్ని విధవల్ని చేసి ఇంటి చాకిరికీ ముఖ్యంగా వంటింటికి పరిమితం చేశారు.

ఆ వ్యవస్థకు బలం చేకూర్చడానికి మతం, మడి, ఆచారం తదితర భావాల్ని విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చారు. అలా బాల్యవితంతువుగా మారి పచ్చని జీవితాన్ని చీకటి గదికి వంటింటి పనులకు పరిమితం అయిన ఫణియమ్మ జీవిత కథే ప్రేమాకారంత్ నిర్మించిన 'ఫణియమ్మ'. ఈ చిత్రం ప్రపంచమంతా మహిళా దశాబ్దం జరుపుకుంటున్న కాలంలో వచ్చింది. కన్నడంలో ప్రముఖ రచయిత్రి ఎం.కె.ఇందిర రచించిన 'ఫణియమ్మ' నవల ఆధారంగా ఈ చిత్రం నిర్మించబడింది.. ఆ నవల ఇంగ్లీషు అనువాదం కూడా అప్పుడే వచ్చింది. సజీవమైన పాత్ర స్ఫూరణతో రచింపబడిన ఈ నవలల్ని కాళీ సంఘం వారు ప్రచురించారు. ఫణియమ్మ ప్రగతి శీలమైన విప్లవాత్మక భావాలున్న పాత్రకాదు. పాత భావాలని తోసిరాజని బయటపడేంత చైతన్యమున్న పాత్రాకాదు. కాని తన జీవితకాలంలో అనుభవించిన వేదన నుంచి అణచివేత నుంచి నేర్చుకున్న పాఠాల ఫలితంగా తన తర్వాతి తరం మూఢ ఆచారాలకు వ్యతిరేకంగా గొంతు విప్పినప్పుడు వారికి ఆలంబనగా నిలుస్తుంది. సరికొత్త భావాల ప్రతినిధులకు ఆమె సమర్థకురాలవుతుంది. అలా తన జీవిత కాలంలో అనుభవించిన వేదన నుంచి అణిచివేత నుంచి నేర్చుకున్న పాఠాల ఫలితంగా తన తర్వాతి తరం మూఢ ఆచారాలకు వ్యతిరేకంగా గొంతు విప్పినప్పుడు వారికి ఆలంబనగా నిలుస్తుంది. సరికొత్త భావాల ప్రతినిధులకు ఆమె సమర్థకురాలవుతుంది. అలా తన జీవిత కాలంలో ఫణియమ్మ ఎదిగిన తీరు సమాజాన్ని అర్థం చేసుకున్న తీరు ఈ చలనచిత్రంలో ఆవిష్కరించబడింది. యదార్ధ గాధని సినిమాగా మలచినప్పటికీ ప్రేమాకాంత్ ఈ చిత్రాన్ని చారిత్రకంగా కంటే కళాత్మకంగా చిత్రించేందుకు ఎక్కువగా యత్నించారు. 19వ శతాబ్దపు ద్వితీయార్ధం నుండి 20వ శతాబ్దం తొలి దశాబ్దాల నడుమ సాగే ఈ కథ స్త్రీ సమస్యపైన చిత్రించబడిన ఉత్తమ చిత్రంగా నిలిచింది. అప్పటికే భారతీయ చలన చిత్ర రంగంలో పుంజుకున్న నవ్య సినిమా ఒరవడికి ఈ చిత్రం బలాన్నిచ్చింది.

1870 నుండి 1952 మధ్య కాలంలో జీవించి ఉన్న ఫణియమ్మ కర్నాటకలోని మల్నాడ్ ప్రాంతంలోని హెబ్బేలిగే గ్రామంలో నివసిస్తుంది. ఫణి పుట్టినపుడు ఆమె గొప్ప జాతకురాలని జ్యోతిషులు చెపుతారు. ఆమె పెళ్ళి 9 ఏళ్ళ వయసులో నంజుండతో జరుగుతుంది. పెళ్ళి కూడా గొప్ప ముహూర్తానికే జరుపుతారు. కానీ పెళ్ళయిన ఆర్నెల్లకే నంజుండ చనిపోతాడు. ఫణి వితంంతువు అవుతుంది. ఆమెకు 13 ఏళ్ళ ప్రాయంలో యుక్తవయసు రాగానే ఆమె గాజులు పగుల కొట్టి, గుండు గీయించి, తెల్లని బట్టలు కట్టించి ఆమెనో చీకటి గదికి పరిమితం చేస్తారు. పదహారు స్థంభాల విశాల భవంతిలో ఓ మారుమూల ఉన్న చీకటి గదే ఆమెకు జీవితమవుతుంది. జరుగుతున్నది ఏమిటో తెలీని వయసులోనే అంతా ముగిసిపోతుంది.

ఆమె మౌనంగా దుఃఖంతో ఆ వైధవ్యాన్ని పాటిస్తుంది. ఆమెకు ఏళ్ళు గడుస్తున్న కొద్దీ ఎదుగుతున్న క్రమంలో ఇతర జీవితాలపట్ల, సెక్సుపట్ల అవగాహన పెరుగుతూ సమాజాన్ని మనుషుల్ని అర్థం చేసుకోవడం ఆరంభిస్తుంది. కనీసం భవంతిలోని మొత్తం గదుల్లోనైనా స్వేచ్చగా తిరగడానికి అనుమతి లేని ఫణియమ్మ తన చీకటి గది ఊచల మధ్య నుంచే లోకాన్ని చూడ్డానికి అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. ప్రసవ వేదన పడుతున్న ఓ యువతికి సహకరించేందుకు మొట్టమొదటిసారిగా బంగళా దాటిన ఫణియమ్మ తమ సనాతన ఆచారాన్ని బద్దలు కొడుతుంది. విధవలు బంగళా దాటరాదన్న నిబంధనని ఆమె ఓ యువతికి సాయం చేయడానికి ఉల్లంఘిస్తుంది. ఫణియమ్మకు జీవితంలో మొట్టమొదటిసారిగా లైంగిక స్పృహ కలుగుతుంది. చీకటి గదికి ఆవల దూరంగా స్త్రీ పుర్షుల సంగమాన్ని ఆమె ఊచల మధ్యనుంచి చూస్తుంది. కానీ సనాతన ఆచార వ్యవహారాల్లో అప్పటికి నిష్ఠాగరిష్టురాలైన ఆమె ఆ సంఘటనని మరిచిపోయేందుకు ప్రయత్నిస్తుంది. ఎప్పటిలాగే తనకు గుండు చేయడానికి వచ్చిన మంగలిని ముట్టుకోవద్దంటుంది. రేపు రమ్మని పంపివేస్తుంది. ఇక ఎప్పటికీ వెంట్రుకలు పెరగకుండా ఉండేందుకు ఓ పసరు తలకి పట్టిస్తుంది. ఈ సంఘటన ఆమెలోని సంఘర్షణను తెలియచేస్తుంది. అదే రీతిలో మడి విషయంలో కూడా ఖచ్చితంగా వ్యవహరిస్తుంది. ఆ కాలంలో మడితో వంట చేయడం, భోజనం చేయడం ఖచ్చితంగా పాటించేవారు. ముఖ్యంగా వితంతువులు మడిగా ఉన్నప్పుడు ఎవరైనా ముట్టుకుంటే తిరిగి స్నానం చేస్తేగానీ భోజనానికి అనుమతించేవారు కాదు. అది గమనించిన ఓ పిల్లవాడు ఫణియమ్మను మడితో ఉండగా తాకి ఆమెను తిరిగి స్నానం చేసేలా

చేస్తుంటాడు. అది గమనించిన ఫణియమ్మ ఏకంగా భోజనమే మానేస్తుంది. ఆ తర్వాత జీవింతాంతం ఒంటిపూట భోజనానికే పరిమితమైపోతుంది. ఇక విశ్వాసాల విషయంలో ఆమె ప్రసవ వేదనలో ఉన్న యువతికి సాయం చేసేందుకు వెళ్ళి తిరిగి వస్తూ తనని తాను శుద్ధిచేసుకునేందుకు స్నానానికి వెళ్ళగా అక్కడ దూరంగా స్నానమాచరిస్తున్న బంధువొకడు కనిపిస్తాడు. ఆమెకు తెలుసు అతను అంతకుముందే ఓ తక్కువ కులంగల స్త్రీతో గడిపి వచ్చి ఆ మాలిన్యాన్ని కడిగేసుకుంటున్నాడని, ఆమెకు ఇలా మడి, ఆచారం, విశ్వాసం, ఉచ్చం నీచం అన్న విషయాలపైన విశ్వాసం పోతుంది. అవసరమైన వాళ్ళకి సాయం చేయడమే సరైన మానవత అని విశ్వసించడం ఆరంభిస్తుంది. ఫణియమ్మకు డెబ్బై ఏళ్ళ వయసున్నప్పుడు దాక్షాయని అనే ఓ పదహారేళ్ళ యువతి భర్త చనిపోతాడు. ఇంట్లో ఆ అమ్మాయి బంధువర్గమంతా ఆమె గాజులు పగల కొట్టడానికి బొట్టు చెరిపేయడానికి, గుండు గీయించడానికి ఉద్యుక్తులవుతారు. కానీ ఆ యువతి అందుకు ఎదురు తిరుగుతుంది. గుండు చేయించడానికి వచ్చిన మంగలి ముందుకు తన అత్తగారిని తోస్తుంది. మంగలిని కొట్టినంత పనిచేస్తుంది. ఇంట్లోకి వెళ్ళి ముఖానికి అందమైన బొట్టు పెట్టుకుని వస్తుంది. విస్తుపోయిన బంధువర్గమంతా ఫణియమ్మను పిలిచి దాక్షాయినికి నచ్చచెప్పమంటారు. వితంతువుగా చేయడానికి ఒప్పించమంటారు. కానీ ఫణియమ్మ మాత్రం 'కాలం మారింది. ఇంకా ఈ మూర్ఖపు విశ్వాసాలేమిటి? దాక్షాయినిని ఆమెగానే బతకమంటుంది. ' అది ఫణియమ్మ పరిపక్వమైన వ్యక్తిత్వానికి ఫలితం. ఇలా పదమూడేళ్ళ బాలవితంతువు స్థితినుండి 70 ఏళ్ళ వయసులో ఆ ఆచారానికి వ్యతిరేకంగా నిలిచే స్థాయిదాకా ఫణియమ్మ ఎదిగిన తీరును చిత్రంలో గొప్పగా విశ్లేషించారు. దర్శకురాలు ప్రేమాకాంత్ విలక్షణమైన రీతిలో ఫ్లాష్ బ్లాక్ టెక్నిక్ ను విరివిగా ఉపయోగిస్తూ కథనాన్ని కొనసాగిస్తారు. ఇక చిత్రం ప్రారంభంలోనే 16 స్తంభాల భవంతిని అందులోని వివిధ గదుల్ని మనకు పరిచయం చేస్తూ అత్యంత కళాత్మకంగా మొదలైన పరిపక్వత చితీకరణలో చివరిదాకా కొనసాగుతుంది. ముఖ్యంగా యువతి ప్రసవ దృశ్యం చిత్రంలో దర్శకురాలి ప్రతిభకి తారాస్థాయి ప్రతిరూపం. అక్కడ ఉపయోగించిన లైటింగ్, కెమెరాని తడిక కున్న రంధ్రంలోంచి సారించడం ఆ ఉద్వేగ సన్నివేశ చిత్రీకరణ అత్యంత ప్రతిభావంతంగా సాగుతుంది. విశాల భవంతిలో మూలనున్న చీకటి గది అందులో ఓ పక్క నేలపైన పడుకుని ఉన్న ఫణియమ్మ ఇలా చిత్రం మొత్తం మీద 'స్పేస్' ప్రధానమైన వ్యక్తీకరణ మాధ్యమంలా ఉంటుంది. సాధారణం నుంచి నిర్దిష్టమైన అంశాన్ని చెప్పే క్రమంలో దర్శకురాలు గొప్ప ప్రతిభని కనబరిచారు.

●●●

## స్మృతి చిత్ర

**భాష:** మరాఠీ, **దర్శకత్వం** - విజయామెహతా; **కెమెరా** - ఆర్తీ మాపాక్షి; సంగీతం - మోహన్; **నటీనటులు** - విజయా మెహతా, సుహాస్ జోషి, పల్లవీ పాటిల్(లక్ష్మీ బాయి), రవీంద్ర మంకానీ, షరీఫ్ జోషి(నారాయణ్ వామన్ తిలక్)

**విడుదల:** 1982

19,20 **శతాబ్దాల్లోని అన్ని కాలాల్ని పరిశీలిస్తే** భారతీయ సమాజంలో స్త్రీకున్న స్థానం, ఆమెకు కుటుంబంలోనూ బయటా ఇచ్చిన స్థానం స్థూలంగా ఒకటిగానే ఉంది. పురుషుడు తన స్వేచ్ఛనీ ఆధిపత్యాన్నీ కాపాడుకుంటూనే ఉన్నాడు. అయితే ఆయా కాలాల్లోని సామాజిక పరిస్థితుల నేపథ్యంలో స్త్రీ పురుష సంబంధాల్లో తేడాలుండొచ్చు. కాని నేటికీ కనిపిస్తున్న వైరుధ్యాలు విచ్చిన్నమైన సంబంధాలు, పైకి ముసుగుగా కనిపించే అనుబంధాలు మాత్రం నాటికీ నేటికీ మౌళికంగా ఒకే విధంగా ఉన్నాయి. చరిత్రను అధ్యయనం చేసినపుడు

పురుష కోణం నుంచి పురుషులు రాసిన చరిత్రకంటే స్త్రీలు తమ చరిత్రను తామే ఏదో ఒక రూపంలో రికార్డు చేసినపుడూ అనేక 'స్త్రీల అనుభవాల నేపథ్యం నుంచి ఆచారాల్ని, అలవాట్లని స్త్రీ పురుష సంబంధాల్ని కుటుంబ విలువల్ని వివరించినపుడు చీకటి కోణాల్లోకి వెలుగు ప్రసరించినట్టవుతుంది. అలాంటి ఒక నిజాయితీ అయిన ప్రయత్నం మరాఠీ సాహియంలో జరిగింది. ప్రామాణిక రచనగా పేరొందిన 'స్మృతి చిత్రే' లక్ష్మీబాయి తిలక్ జ్ఞాపకాలు. ఆ జ్ఞాపకాల్లో 19 వ శతాబ్దపు చివరి, 20 శతాబ్దపు తొలి దశాబ్దాల కాలంలోని సామాజిక చరిత్ర స్త్రీ స్థితిగతుల చరిత్ర, మత విశ్వాసాల చరిత్ర నిక్షిప్తమయ్యాయి. ఆనాటి సామాజిక విశ్వాసాలను కుదిపి వేసిన రెవరెండ్ నారాయణ్ వామన్ తిలక్, ఆయన భార్య అయిన లక్ష్మి భాయి తిలక్‌ల విలక్షణమైన వ్యక్తిత్వాల్ని ఆవిష్కరిస్తూ తన జ్ఞాపకాల్ని రాసారు లక్ష్మీ బాయ్ తిలక్. ఆ జ్ఞాపకాలు 70 ఏళ్ళ పాటు విస్తరించి ఉంటాయి. ముఖ్యంగా 1880 - 1900 సంవత్సరాల నడుమ కాలాన్ని


విజయా మెహతా

ప్రధానంగా చేసుకుని సాగుతుందీ రచన. చారిత్రాత్మకమూ విలక్షణమూ అయిన ఆ రచనను ఆధారం చేసుకుని ప్రముఖ మరాఠీ దర్శకురాలు విజయా మెహతా 'స్మృతి చిత్రే' చిత్రం కోసం విశేషమైన పరిశోధనను నిర్వహించారు. లక్ష్మీబాయి తిలక్ నివసించిన ప్రాంతాల్ని, ఆనాటి విశేషాల్ని ఉటంకించిన పుస్తకాల్ని అధ్యయనం చేశారామె. లక్ష్మి బాయి తిలక్ మనోభావాల్ని అర్థం చేసుకోవడానికి ఆమె అనుభవాల సారాన్ని వంటబట్టించుకోవడానికి విజయా మెహతా తీవ్ర కృషి చేశారు. ఆనాటి సనాతన బ్రాహ్మణ కుటుంబ జీవనరీతుల్ని పరిశీలించి సినిమాని పీరియడ్ ఫిల్మ్‌గా నిర్మించడంలో విజయా మెహతా కృతకృత్యులయ్యారు.

రెవరెండ్ నారాయణ్ వామన్ తిలక్ ఆనాడే తన బ్రాహ్మణత్వాన్ని వీడి క్రిష్టియన్ మతాన్ని స్వీకరించి పెద్ద అలజడిని సృష్టించారు. ఆయన స్మృతిలో లక్ష్మీబాయి తిలక్ తన జ్ఞాపకాల్ని క్రమమైన రీతిలో రచనా బద్దం చేశారు.

లక్ష్మీబాయికి పదకొండేళ్ళ వయసులోనే పెళ్ళయింది. కాని ఆమె భర్త నారాయన్ వామన్ తిలక్ పదేళ్ళపాటు ఆమెను తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేశాడు. ఆకాలమంతా లక్ష్మీబాయి తన మామ నీడలో బతికింది. అయితే ఆ మామకు ఆమె అంటే అసలు ఇష్టం ఉండదు. ఆమె తమకు పట్టిన దురదృష్టమని అతను భావించేవాడు. కానీ కాలం గడిచేకొద్దీ ఇష్టంలేని ఆ కాపురంలోనే లక్ష్మీబాయి వామన్ తిలక్ కి ఇద్దరు పిల్లలు పుట్టి పురిటిలోనే చనిపోతారు. వారి చావులు లక్ష్మీ బాయిని మరింత దుఃఖపెడతాయి. కానీ కాల్రక్రమేణా తిలక్ తన భార్యను చదువుకోమని వత్తిడి చెస్తాడు. లక్ష్మీ బాయి తన భర్తనుంచి కానీ ఇతర విద్యాసంస్థలనుంచి గానీ సహకరం, ప్రోత్సాహం లేకుండానే తన విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తుంది.

బ్రాహ్మణ మేధావి అయిన నారాయన్ నామన్ తిలక్ 1895లో క్రిష్టియన్ మతాన్ని స్వీకరిస్తాడు. కనీవినీ ఎరుగని ఈ పరిణామం మొత్తం బ్రాహ్మణ వర్గాన్ని అతలాకుతలం చేస్తుంది. లక్ష్మీబాయి కుతుంబం విచ్చిన్నమవుతుంది.అయిదేళ్ళపాటు వారిద్దరి మధ్యా సంబంధాలు తెగిపోతాయి. వామన్ చేసిన చర్య ఫలితంగా లక్ష్మీబాయిని ఆమె ఎదుగుతున్న కొడుకుని బ్రాహ్మణ సమాజం తీవ్ర నిరాదరణకు గురిచేస్తుంది. సామాజికంగా దాదాపు ఒంటరిదైపోతుంది లక్ష్మీబాయి. మరోవైపు వామన్ తిలక్ చేపట్టిన క్రిష్టియన్ సమాజం లక్ష్మీబాయిని ఆమె భర్తతోనే ఉండాలని వత్తిడి చేస్తుంది. అప్పటికి తిలక్ అహ్మద్ నగర్ లోని అమెరికన్ మిషన్‌లో రెవరెండ్ స్థాయికి చేరుకుంటాడు.

అదే ఊర్లో నివసిస్తున్నప్పకీ లక్ష్మీబాయి భర్తనుంచి వేరుగానూ సంపూర్ణ హిందువుగానూ ఉండేందుకు ప్రయత్నం చేస్తూ ఉంటుంది. తన ప్రమేయం లేకుండానే భర్త తీసుకున్న నిర్ణయానికి సాటి సమాజం నుంచి తీవ్రమైన వత్తిడిని నిరాదరణని అనుభవిస్తుంది. లక్ష్మీబాయి.

అయిదేళ్ళ తర్వాత లక్ష్మీబాయి జీవితంలో జరిగిన ఒక సంఘటన ఆమె జీవితాన్ని ఆమె ఆలోచన విధానాన్ని మార్చి వేస్తుంది. ఊహించని స్థితిలో తప్పనిసరి పరిస్థితిలో లక్ష్మీబాయి ఒక ముస్లిం సేవకుడు నింపిన కుండలోంచి గ్లాసెడు నీరు తాగాల్సి వస్తుంది.

అప్పటి దాకా సనాతన హైందవ మతాన్ని తు.చ. తప్పకుండా ఆచరిస్తున్న ఆమె అలా ముస్లిం చేతి నీళ్ళను తాగాల్సి రావడం తన విశ్వాసాలకు హిందూ దేవతలకూ అపచారం చేసినట్టు భావించాలి కానీ ఆమె తనలోకి తాను పరిశీలన చేసుకుంటుంది. తను అంతవరకూ విశ్వసించిన విషయాలపైన ఒక్కసారిగా విమర్శనాత్మక కోణంలోంచి దృష్టిసారిస్తుంది. కులమూ మతమూ అన్న భావాలకి అసలు అర్థమేమైనా ఉందా? అవన్నీ మనుషుల్ని ముక్కలు చెక్కలు చేయడంలేదూ అని పరిపరి విధాల తలపోస్తుంది. ఆమెలోని జ్ఞానం మేల్కొంటుంది. కులమూ మతమూ అన్నీ మనిషి సృష్టించుకున్న అంతరాలే తప్ప మానవజాతి అంతా ఒక్కటేనన్న సత్యాన్ని ఆమె అర్థం చేసుకుంటుంది. సంపూర్ణ మతాతీతమైన మనిషిగా ఆమె ఎదుగుతుంది.

1900 సంవత్సరంలో ఆమెకూడా క్రిస్టియన్ మతాన్ని స్వీకరించి భర్త వద్దకు చేరుతుంది. ఇక్కడోమాట చెబుతుందామె. ఏ ఒక్క మతమూ మరో మతానికంటే గొప్పది కాదు. అన్ని మతాలూ సమానమైనవే. అన్ని మతాలకు సర్వమానవ శ్రేయస్సే లక్ష్యం. కానీ నాకూ నా భర్తకూ ఇంకా ఈ మతాల అంతరం ఉండరాదని నేను క్రిస్టియన్‌ని అయ్యానని ఆమె ప్రకటిస్తుంది. మొత్తంగా జీవితకాలంలో సంఘర్షణాత్మకమైన జీవితాన్ని గడిపిన లక్ష్మీబాయి జ్ఞాపకాళు ఆనాటి స్థితిని కళ్ళముందుకు యదార్థంగా తెస్తాయి. ఆమె రాసిన అంశాల్ని సూక్ష్మమైన విషయాలూ, వివరాలతో సహా విజయా మొహతా తన సినిమాలో కళాత్మకంగా నిక్షిప్తం చేశారు. విలక్షణమైన లక్ష్మీబాయి జీవితాన్ని, ఆలోచనల్నీ సెల్యులాయిడ్ పైకి మరల్చడంలో విజయా మెహతా గొప్ప విజయాన్ని సాధించారు. పీరియడ్ ఫిల్మ్‌ని ప్రతిభతో దర్శకత్వం వహించడంతో పాటు ఆమె లక్ష్మీబాయి పాత్రని కూడా పోషించి మెప్పించారు. తొలి చిత్రమే అయినప్పటికీ స్మృతి చిత్రే విజయా మెహతా కెరీర్‌లో విలక్షణ చిత్రంగా మిగిలిపోయింది. ఓ స్త్రీ జ్ఞాపకాల ప్రవాహాన్ని మరో స్త్రీ అంతే ప్రవాహ వేగంతో చిత్రబద్ధం చేయడం గమనార్హం, ప్రశంసనీయం.

●●●

Click here to share your comments on this article.